

# మమతల తీగలు

ఎస్. రజానబి

వేసవికాలపు ఎండ బైట చంద్ర నిప్పులను కురిపిస్తోంది. పైన ఫ్యాను గిరగిర బొంగరంలా తిరుగుతూంది.

వీధిలో బిక్షగత్తె పిలుపు అతిదీనంగా చెవులకు తాకుతోంది. ప్రక్కవాటాలో అద్దె కుంటున్న పిల్లల అరుపులు తారాస్థాయి నందుకొంటున్నాయి/

మరో ఎడమ ప్రక్క వాటాలోనుంచి సన్నని సంగీతం మధురంగా చెవులకు తాకుతోంది.

ఇన్ని వింటూనే నేను పుస్తకంలోనే తలపుంచి దీక్షగ చదువుతున్నాను.

. బైట పిల్లల అరుపులకు మనసు విశ్చలంగ లేకపోవటంవలన చదివిన వాక్యమే మరలా చదువుతున్నాను.

గబుక్కున కరెంటు పోయింది.

పేదవాని వేదనలా ఫ్యాను తిరగలేక తిరుగుతోంది !

మెల్లగా ఫ్యాను ఆగిపోయింది.

ఉక్కపోయటం ప్రారంభమయింది. మరోపేజీ త్రిప్పాను,

'బ్రతుకు _ భయానకంగ _ సాగిపోతున్నప్పుడు ఎంతో ధైర్యంతో ఆత్మవిశ్వాసంతో అడుగు ముందుకు వేయటం నేర్చుకోవాలి సారదీ అని అంటుంది పుస్తకంలోని నాయికి నాయకునితో.

ప్రక్క వాళ్లింటికి ఎవరో బంధువులొచ్చారు కాబోలు.

'రండి ! రండి !' అనే పిలుపులు విన్పిస్తున్నాయి.

మా యింట్లో ఏమాత్రం అలికిడి లేదు, ఒక్క గోడగడియారం టిక్కుటిక్కు మనేశబ్దం తప్ప.

నాన్న అప్పుడే భోజనం ముగించి పైకి వెళ్లిపోయారు.

సెకండుఫారం చదివే సుధ, ఫిఫ్తుఫారం చదివే ప్రసాద్ స్కూళ్లకు క్యారియర్‌లో అన్నం తీసికుని వెళ్లిపోతారు. మధ్యాహ్నం వాళ్ళు యింటికి రారు. సాయంత్రం ఐదుగంటలకు వస్తారు.

నాన్నగారికి పక్షవాతం వచ్చిన దగ్గరినుండి శారీరకంగ, మానసికంగ ఎంతో కృంగి పోయారు.

_ అందరికన్నా పెద్దన్నయ్య బొంబాయిలో వో పెద్ద కంపెనీలో పనిచేస్తూ అక్కడే వో ముస్లిం అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసికొని స్థిరపడిపోయాడు.

మళ్లీ ఫ్యాను గిరగిర తిరుగుతోంది ?

నేను పైకి చూశాను.

కాలం యిలాగే తిరుగుతోంది మరి !

మనిషి పొందే బాధలతో, కష్టాలతో నిమిత్తం లేకుండా దానిపని అది చేసుకుపోతోంది !

బైట ఎండ తీక్షణంగానే వుంది.

దాదాపు ఒంటిగంట కావొస్తుంది.

మరల పుస్తకం చదవటంలో మునిగిపోయాను.

వో అరగంట ఆగిన తర్వాత 'పోష్టు' అనే కేకతో తల పైకెత్తాను.

పుస్తకం ప్రక్కనపెట్టి లేచి కవరందుకున్నాను.

కవరుమీద అక్షరాలు చూడటంతోనే గుండెలలో ఎన్నెళ్లనుండో దాగిన ఆప్యాయతకు చిహ్నంగ ఒక తియ్యటి భావన గుబగుబ లాడింది.

కవరు విప్పుతోంటే చేతులు వణకలేదు. హృదయం దడదడ లాడలేదు. కళ్లు ఆత్రుతతో, భయాందోళనలతో అక్షరమాలను చూడటంలేదు.

అది తెలుగు టీచరుగారు వ్రాసిన వుత్తరం. చాలాకాలానికి వుత్తరం వ్రాసారనే తలపే నాకెంతో తృప్తినిస్తుంది. ఏదో మధురమైన భావనా వీచికలతో, తియ్యని గీతికలతో, మమతల తీగలతో మనసు నిండి పోయింది.

ఆమె నాపట్ల చూపిన అపారమైన ప్రేమానురాగాలకు చిహ్నంగా కళ్ళల్లో నీళ్లు సుళ్లు తిరిగాయి.

కన్నీళ్ల తెరటాల మాటున పదేళ్ల క్రిందట చూచిన తెలుగు టీచరుగారి మూర్తి కళ్లముందు సాక్షాత్కరించింది.

పసుపు కుంకుమలు కోల్పోయిన ముఖమైనా, పచ్చటి ఛాయలోని ఆనోములో మందిరనవు బంగారు కాంతులు కన్పిస్తూ వుంటాయి.

ఆమె నేత్రాలు సహృదయతకు, సంస్కారానికి ప్రతీకగా వెలుగులను చిమ్ముతూ వుంటాయి.

ఆమె నల్లని జుత్తులోని అక్కడక్కడి తెల్ల వెంట్రుకలు ఆమె సాహచర్యంలో ఆరితేరిన విద్యార్థులుగా కన్పిస్తాయి. ఆమె చేసిన గొప్పపనులకు అవి నిదర్శనాలు,

నన్నని తీగలాంటి పెదాలపై ఎప్పుడూ చెరగని చిరునవ్వు దోబూచులాడుతూ వుంటుంది.

ఆ నవ్వులో మల్లెలు విరియవు. ఆ నవ్వులో ముత్యాలు అగుపించవు.

కాని సృష్టిలో ఎక్కడా దృగ్గోచరం కాని స్వచ్ఛత తాండవిస్తూ వుంటుంది.

ఎన్నెన్నో అగాధాలను, సుడిగుండాలను, భయంకరమైన జ్ఞాపకాలను, భరింపలేని కథలను, అనుభవాలను మరింకెన్నింటినో గుండెలోని బంగారంలా దాచుకొంటూ పైకి స్వచ్ఛంగా నవ్వగల నైపుణ్యం ఆమెకు పుట్టుకతో వచ్చినదే! ముత్యాల్లాంటి అక్షరాలమీదకు నా దృష్టి ప్రసరించాను.

అమ్మా, రేఖా!

నీ జాబు అందినది. శుభాశీస్సులు!

నీ జాబులో ద్వేషం, రోషం, పగ, కక్షలకన్న ఆవేశంతో కూడిన ఆత్మీయత, అన్యులపై పెంచుకున్న మమతానుబంధం, సృష్టిద్వారా నీవు పొందే సంతోషం, తృప్తి, మంచితనంలోగల తపనను, వ్యథను ఎక్కువగా వ్యక్తపరిచావు.

పిచ్చిరేఖా!

'ఈ ప్రపంచం మమతల తీగలతో సుందరంగా అల్లుకున్న పందిరిలాంటిది' అన్నావు.

నిజమే! నేను ఒప్పుకొంటున్నాను. కాని మమతే జీవితంగా స్వార్థరహితంగా మనుగడ సాగించుకోవాలనే తపన వుంది చూశావూ! అది కారుచిచ్చులాంటిది.

ఎక్కువ మమత నిన్ను దహించి వేస్తుందని తెలియదా? 'అతి సర్వత్రా వర్జయేత్' అని మర్చిపోయావా?

పండ్లు అమ్ముకొనే పడుచుపిల్లను చూచి ఓ లక్షాధికారి వివాహం చేసికోవటమనేది సినిమాలో చూస్తున్నంత సుందరంగ నిత్యజీవితంలో మనం చూడలేము.

మన ముందు కన్పించే వాస్తవం వేరు. సినిమా వేరు

సినిమాలోలాగ ఆదర్శంగా, ఆత్మీయంగా మంచిమార్గాన నడవాలనుకోవటం అవివేకం!

ఏదైన మంచి వుంటే నీవు గ్రహించు కాని అదే అందర్నీ చెయ్యమని ఆదేశించకు!

జీవితంలాంటిది సినిమాకాని సినిమాలాంటిది జీవితంకాదు సుమా!

రోజురోజుకు అధునాతనంగా రూపొందుతున్న యీ లోకంలో నీవు మనసు తెరిగి మసలుకోవటం మర్చిపోతున్నావు

మంచినిచ్చేవాళ్లకి మంచియివ్వు. చెడు యిచ్చేవాళ్లకు చెడునే యివ్వు.

కాని చెడును మంచిగా స్వీకరిస్తున్నప్పుడు సంఘం దృష్టిలో నీవొక అప్రయోజకురాలిగా, పనికిమాలిన వ్యక్తిగా ముద్రవేయబడతావు.

ముల్లును ముల్లుతో తీయటానికి ప్రయత్నం చేయి! కాని ఆకుతో తీయాలనే తపనతో వృథాగా శ్రమించి ఆకులాంటి నీ మనస్సును గాయపరచుకోకు!'

వుత్తరం చదవటం ఆపు చేశాను.

అప్పటికే నాకళ్ళల్లో నీళ్లు చెంపల మీదకు జారాయి.

'అయితే నా మనసు తెలుగు టీచరుగారు కూడ తెలుసుకోలేదా?

నేను, అతిగా పోతున్నానా?

తండ్రి వాత్సల్యం, అన్నయ్య అనురాగం, అమ్మ ప్రేమ ఎరుగని నేను ఆత్మీయత పెంచుకోవటం తప్పా?

లేక అందరూ నన్ను దూరంచేయటం తప్పా? ఈ లోపం ఎక్కడుంది?

మళ్లీ వుత్తరంపై కళ్లు నిలిపాను.

ఈ అధునాతన యుగంలో లౌకిక జ్ఞానం ఎంతగా అలవర్చుకోవాలో నీవు పూర్తిగా మర్చిపోతున్నావు.

నిజాన్ని చెప్పకు. అన్యాయాన్ని ఖండించకు. ధర్మాన్ని చాటకు! చూసీచూడనట్లుగా వినీ విననట్లుగా అంటీఅంటనట్లుగా మసలుకోవాలి!

అంతేగాని న్యాయమంటూ, ధర్మమంటూ కుండ బద్దలుకొట్టినట్లు మాట్లాడితే ఎన్నో బాధలకు లోనుకావడమే కాకుండా యితరులద్వారా నీవు ఆశించే సహాయం, కొన్ని పనులు ఆగిపోతాయి సుమా!

ఆధునికయుగంలో అంతరాత్మల జోలికిపోకుండ, ఆవేశానికి లోనుకాకుండ, అవసరాలను తీర్చుకోవటం నేర్చుకో!

అలాగాక వాళ్ళుచేసే సహాయంకన్నా వాళ్ల అంతరాత్మే ముఖ్యమనుకొన్నావో నీవు సమస్యల మైదానంలో పల్టీలు కొట్టవలసివస్తుంది.

అన్నివస్తువులులాగానే అధునాతన యుగంలో 'ఆత్మీయత'ను విల్వచేసికోవటం నేర్చుకో?

నీవు అక్కరలేదనుకొనేవారినిగురించి ఎక్కువగా ఆలోచించి, బుర్ర బద్దలు కొట్టుకొనేకన్నా నీవు కావాలని నిన్ను ఆశించేవారిని ఆర్ద్రతతో ప్రేమతో ఆహ్వానించటం నేర్చుకో?

ప్రపంచం వో పెద్ద సినిమా హాలు లాంటిది.

సినిమాహాలులో నేలనుండి బాల్కనీ వరకు ఎన్నిక్లాసులున్నాయో అలానే క్లాసులవారి మనుష్యులు వున్నారని మర్చిపోతే ఎలా?

నేలలో కూర్చున్నా, బెంచీలో కూర్చున్నా బాల్కనీలో కూర్చున్నా సినిమామాత్రం ఒక్కటే! అయినా సినిమాకన్న మనిషి

కూర్చునే క్లాసు ముఖ్యం. క్లాసును బట్టే మనిషిని గౌరవిస్తూ వుంటారు. అది సహజమైన విషయమై పోయింది.

రేఖా! నాకు ఆత్మీయత లేదు, మమత లేదు. అని వెర్రిగా యితరులపై మమతను పెంచుకున్నందువల్ల నీ హృదయాన్ని కొల్లగొట్టుకుంటున్నావని మర్చిపోతున్నావు.

మీ నాన్ననుండి, తమ్ముళ్ళనుండి అన్నయ్యనుండి దానిని ఎందుకు సాధించలేవు? నీ యింట్లోవాళ్ల దగ్గర పొందలేని నీవు మరెక్కడా పొందలేవు. ముందు నీ యిల్లు ముఖ్యం!

మీ అమ్మ పోయిన దగ్గరినుండి ఎన్నెన్నో బాధలకు, అవమానాలకు, కష్టాలకు లోనై అతిచాకచక్యంగ ఎంతో నైపుణ్యంలో కుటుంబాన్ని లాక్కొస్తున్నావు. నిజమే! కాని వాళ్ళపై మమత పెంచుకున్నాను వాళ్లకు నామీద లేదనుకోవటం వ్యర్థం.

'అసలు నిన్నెవరు మమత పెంచుకోమన్నారు' అనే ప్రశ్న ఉద్భవించినప్పుడు నీవిచ్చే సమాధానం ఏమిటి?

మీ యింట్లో రెండేళ్ళుగా అద్దెకుంటున్నంతమాత్రాన మురళన్నయ్యమీద నీ వెందుకు మమత పెంచుకోవాలి?

వాళ్లు వెళ్ళి పోవటంతో ఎందుకు వాపోనాలి? మమత, అనురాగం పెంచుకున్నందువలన నష్టపోయిందెవరు? నీవే.

# మమతల తీగలు

మురళన్నయ్య వుద్యోగరీత్యా ఆయన కర్తవ్యాన్ని నిర్వర్తించుకోవటం కోసరం నీ వూరు వచ్చాడేకాని నీపై మమత పెంచుకొని, నీకు వున్నలోటును భర్తీ చేయటానికా? కాదు. ఎంతమాత్రం అలా కాదు.

వుద్యోగరీత్యా వచ్చాడు. మరల ట్రాన్స్‌ఫర్ కావటంలోనే వెళ్ళిపోయాడు. అది లోకసహజం. కంపార్టుమెంటులోని ప్రయాణీకుల్లా విడిపోవటం, అలా మసలుకోవటం ఎంతైనా అవసరం.

చెల్లెవని నీపై మమకారం పెంచుకొని నిద్రహారాలు మానేసి భార్యాబిడ్డలను పట్టించుకోకుండ నీ దగ్గరే నీ యింట్లోనే వుండిపోవటం చాల అవివేకం. అర్థహీనం.

మల్లెపువ్వులాంటి నీ మమతను వాడనివ్వకు. దాని సువాసనలు నలుదిసలా వెదజల్లటానికే ప్రయత్నించు.

ఈ రోజుల్లో ప్రతిఒక్క మనిషినుండీ అధికంగా 'మనీనే' ఆశిస్తారుకాని నీలా 'మమతను' ఆశించరు సుమా!

ఆ మాటకు అర్థం లేదు. సువాసన లేదు.

వ్యర్థమైన ప్రశ్నలతో నిరర్థకమైన ఆలోచనలతో అమూల్యమైన కాలాన్ని ఎంతగా దుర్వినియోగం చేస్తున్నావో కొంచెం ఆలోచించు!

ఎవరైతే నీపై ఎంత ప్రేమానురాగాలను కురిపిస్తారో అంతవరకే నీవు తిరిగి యివ్వు. అంతేకాని వాళ్లు యిచ్చే దానికి రెట్టింపు యిచ్చి బాధలకు, సమస్యలకు లోను కావొద్దు.

దీర్ఘమైన యీ జీవిత కాలంలో యింకా నీవెన్నో అనుభవాలను నేర్చుకోవాలని, నీ భావి వుజ్వలంగ వుండాలని, నీ వెల్లప్పుడూ ఆవేదనతో కాకుండ ఆనందంతో కళకళలాడుతూ వుండాలని మనస్ఫూర్తిగా ఆశిస్తూ ముగిస్తున్నాను.

మీ టీచరుగారు,

అనసూయదేవి.

టీచరుగారి వుత్తరం చదవటం పూర్తి కావటంతోనే నాన్నగారి పిలుపు పైనుండి దీనంగా జాలిగా వినిపించింది.

రెండేళ్ళక్రితం నాన్నగారు తాలూకాఫీసులో సమాప్తిగ చేస్తూ రిటైరైపోయారు.


అమ్మ వెళ్ళిపోయే నాటికి అన్నయ్య చదువు అయిపోగా మిగిలిన ఆస్తి మూడు పోర్షనులుగల ఒక్క డాబామాత్రమే.

మధ్యవాటాలో మేము వుంటూ యిరుప్రక్కలా అద్దెకిస్తూ వుంటాము. మా వీధి అంత సెంటరు కాకపోవటం వలన అద్దె తక్కువే. ఒక్కొక్క పోర్షన్‌కు ముప్ఫయి రూపాయలు.

ఇటీవలే డాబాపై ప్రత్యేకంగా నాన్నగారి సౌకర్యం కోసరం వో చిన్న గది కట్టించిన కారణంగ నాన్నగారు భోజన సమయంలోనే క్రిందవుంటారు. మిగతా కాలంలో పైగదిమీదనే గడిపివేస్తారు. పైన గది చిన్నదైనా గాలి ధారాళంగా వీస్తుంది. కావలసినంత ప్రశాంతత. ఆ గదిలో వున్నంతసేపు నాన్న బాధలకు సమస్యలకు దూరమై పోతున్నట్లు అనుభూతి చెందుతారు. ఆయనదదొక తత్వం.

తలుపులు దగ్గరగావేసి ఎడమచేతి వైపుగా మెట్లెక్కి పైకి వెళ్ళాను.

నాన్న ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నారు. నా అడుగుల చప్పుడు విని ప్రక్కకు తిరిగారు.



'ఏం నాన్నా పిలిచారా?' అన్నాను.

'నెల పూర్తయిందనుకుంటాను. అద్దె యిచ్చారా?' తీక్ష్ణంగాచూస్తూ అన్నారు.

'లేదు నాన్నా! నేనింకా అడగలేదు.' తగ్గుస్వరంతో అన్నాను

'అలా అడగకపోతే ఎలా! మొహమాటానికిపోతే మన యిబ్బందులు ఏం కావాలి? ఎడమ చేతితో కుడిచేతిని రుద్దుకొంటూ ముఖంలో క్రోధాన్ని ప్రస్ఫుటపరుస్తూ అన్నారు.

నాన్నకు మొదటినుండీ కోపంమెండు. మరీ పక్షవాతం వచ్చిన దగ్గరినుండి యింకా ఎక్కువైపోయింది.

పెద్ద కొడుకును తలచుకుంటూ తిట్టుకోవటం, చిన్న కొడుకులు సరిగా చదవరని ఎప్పుడూ తిరుస్తూనే వుంటారు.

ఒక్కొక్కసారి పిల్లందరిమీద కోపం నాపై చూపుతూ నన్ను ఎన్నోమాటలు అంటూనే వుంటారు.

అమ్మలాగా నేనూ భరించటం మంచిదనుకుంటాను.

ఆయనకు ఎదురుతిరిగి మాట్లాడితే యింకా కోపం ఎక్కువ.

అయిన దానికీ కాని దానికీ చికాకు పడటం, పెద్దపెద్దగా అరవటం ఆయనకు బాగా అలవాటై పోయింది.

'రేఖా! నీ భోజనం అయిందా?' అని ఎప్పుడైనా అడుగుతారేమో ననుకుంటాను.

ఉహు...ఆయన మాటలలో లాలిత్యం ప్రేమానురాగం నేనెన్నడూ ఎరుగను.

ఆయనకెందుకో యింట్లో అందరిపై ద్వేషం.

ఒక్కొక్కసారి తండ్రికి ఎన్నోబాధలు చెప్పుకొని వూరట పొందుదామని, ఆర్థిక సమస్యలగురించి సలహాలడుగుదామని యింకా ఏమేమో చేయాలనుకుంటాను. కాని ఆయన ఉగ్రరూపంచూచి ఏమీ అడగలేకపోయ్యాను.

ఎలాగో సమాధానం చెప్పాలనే ఉద్దేశ్యంతో 'అద్దె అడిగి తీసికుంటానులే నాన్నా!' అనిచెప్పి గబగబ క్రిందకు దిగి వచ్చాను.

దుఃఖం కట్టలు తెంచుకు వస్తోంది. నాన్నకెప్పుడూ యిల్లూ, అద్దె,






ముగపిల్లలుగురించే కాని నాగురించి ఒక్క అనునయ వాక్యమైన అడుగుతాడేమో నను కుంటాను.

అసలు నాగురించిన ఆలోచన ఆయ కకు లేదు.

కళ్లవెంట నీళ్లు సుళ్లు తిరిగాయి. మురళన్నయ్య జ్ఞప్తికిరాగ హృదయం బాధతో మెలికలు తిరిగిపోయింది

వో రోజు సాయంకాలం 'ఏమండీ యిక్కడ అద్దెకుండే యిళ్లేమైన వున్నాయా?' అని బైట ఎవరినో అడు గుతూవుంటే వరండాలోవున్న నేను.

'ఒక పోర్షన్ ఖాళీగా వున్నదండి రండి!' అన్నాను.

అంత చొరవగా పరాయి వ్యక్తితో పైగా మగమనిషితో మాట్లాడినందుకు నేనెంతగానో సిగ్గుపడ్డాను. బాధపడ్డాను.

ఆయన గేటు నెట్టుకొని లోపలకు వచ్చారు.

మనిషి నలుపు. మంచిపొడవు పొడవుకు తగ్గ లావు. కొన్నిరోజుల క్రిందటే తిరుపతి వెళ్లారు కాబోలు నున్నటిగుండు విశాలమైన పాలభాగం. మమతలో నిండిన కళ్లు. మాటలలో లాలిత్యం, ప్రేమ ధ్వనిస్తున్నాయి. చేతిలో చిన్నబ్యాగ్ పట్టుకొని అలాగే నిలబడ్డారు. అనురాగంతో నిండిన ఆయన మూర్తిని చూస్తూ నేను సభ్యతనుకూడ మర్చిపోయాను.

ఆ తర్వాత ఎప్పటికో తేరుకొని 'రండి లోపలకు' అంటూ కుర్చీ చూపించాను.

# మమతల తీగలు

ఫర్వాలేదంటూనే కూర్చొని గదంతా కలియజూశారు. ఆ తర్వాత వాళ్లుండ బోయే పోర్షను చూపెంచి ఐదు రూపాయలు బయానా తీసికొని గది తాళాలు ఆయన కిచ్చాను.

వద్దనేకొంది ఆయన ముఖారవిందం, మాటతీరు పదేపదే జ్ఞప్తికి రాసాగాయి.

ఇంట్లో అన్నయ్యమీద నాకెంత మాత్రం మమకారం లేదు. తనను పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు చెప్పించి వో గొప్ప వ్యక్తిగ తీర్చిదిద్దిన తల్లి దండ్రులను మరిచి, బాధ్యతలను విస్మరించి కనీసం నా వివాహ విషయమైనా ఆలోచించకుండా స్వార్థంతో దూరంగాపోయి సుఖపడు తున్న అన్నయ్యను చూస్తుంటే నాకెంతో కోపం. ఆపై ఎంతో సానుభూతి.

అన్నయ్యంటేనే నాకు అసహ్యం రోత.

అందుకే ఉత్తరాలుకూడ వ్రాయను.

అన్నయ్య చెల్లిపై చూపే వాత్సల్యం నేనెరుగను. తండ్రి బిడ్డపై కురిపించే అనురాగం నేనెరుగను.

'అమ్మవుంటే?' అనేప్రశ్న నాలో వుదయించినప్పుడు నా మనస్సు భూకంపంలా వణికిపోతోంది.

అన్నివిధాలా నష్టజాతకురాలినే. ఎవరిప్రేమకు, ఎవరి వాత్సల్యానికి ఎవరి ఆదరణకు నోచని నాకు కన్నీళ్లే మిగులుతూ వుంటాయి.

ఈ ప్రపంచమంతా ఏదోఒక బంధంతో యింకేవో అనుబంధాలతో ఒకరిపై ఒకరు మమతాను రాగలను నింపుకొంటూ ముందడ సాగిస్తుంది.

అలా నేనెవరిపై మమతను నింపుకోవాలి! అని ప్రశ్నించుకున్నప్పుడు ఆత్మీయులపై స్నేహితులపై అని సమాధానం వస్తుంది

అందుకే మురళన్నయ్యను ఆనాడే నా హృదయంలో 'అన్నయ్యగ' చిత్రించుకున్నాను.

వో మంచిరోజున అన్నయ్య వాళ్ల సామానుతో భార్య, సంవత్సరం పాప, తల్లితో యింటికి వచ్చారు.

అన్నయ్య సాత్విక తత్వం కలవాడు. చిన్నప్పటినుండి అటువంటి తత్వం కలవాడేనట.

మొదట అన్నయ్యతో నేనెన్నడూ మాట్లాడి ఎరుగను. చాటుమాటున అన్నయ్యను చూడటం తప్ప ఆయనను ఎన్నడూ పలుకరించి ఎరుగను. అంతటి అవసరం కూడ లేకపోయేది.

భోజనంచేసి పదిగంటలకు ఆఫీసుకు వెళ్లే అన్నయ్య సాయంకాలం ఐదుగంటలకు గాని తిరిగిరారు

ఆయన పనేమో, ఆయనేమో, ప్రతి ఒక్క మనిషిని సహృదయతతో అర్థం చేసుకోవటం, మంచిగా గుర్తించటం ఆయన సుగుణాలలో చెప్పుకోదగినవి.

దాదాపు ఆయనకు మూడువందలు జీతం వస్తుంది. ఇద్దరు తమ్ముళ్లు బి.ఎస్.సి. చదువుతున్నారు. మరో చెల్లి విశాఖలో ఎమ్. ఎస్. సి. చదువుతుంది.

తన కుటుంబాన్ని పోషించుకుంటూనే తమ్ముళ్లకు, చెల్లికి డబ్బు పంపుతున్నారంటే నేనెంతో ఆశ్చర్యపోయేదానను.

బాధ్యతాయుతమైన మనుష్యులు ఎక్కడవున్నా ఎందరిలో వున్నా తమ బాధ్యతను విస్మరించరు కదా!

ప్రతిరోజూ భోజనానికి ముందు దాదాపు గంట గంటన్నరసేపూ పూజచేయటం అన్నయ్య దినచర్యలో ముఖ్యమైనది, ప్రధానమైనది.

అన్నయ్య మంత్రోచ్చారణ వుదయాన్నే చెవులకు సోకుతూవుంటే నేనెంతో శ్రద్ధతో తన్మయత్వంలో వూగిపోతూ

విజయవాడలో దొంగలెక్కువంటారు కానీ యింత వరకూ నాకేం నిదర్శనాలు కనిపించలేదు..!



వుంటాను.

కాలం దొర్లిపోతూనే వుంటుంది. మరో క్రొత్త క్యాలెండరు రావటం జరిగింది. మురళన్నయ్య ప్రేమానురాగంలో అసలు అన్నయ్యను నేనెన్నడో మర్చిపోయాను.

నాన్న అరుపులకు, మందలింపులకు, కోపతాపాలకు నేనెంతమాత్రం బాధపడటం లేదు. అన్నయ్య అనురాగపూరితమైన పల్కులకు నేను సర్వం మర్చిపోయేదానను.

తమ్ముళ్లు సరీగా చదవటం లేదనే చింతను కూడ విస్మరించాను.

అన్నయ్యమీద నాకెందుకో అవ్యాజమైన భక్తి. అనంతమైన అనురక్తి. జీవితాంతం. అన్నయ్యగా గుండెలో స్మృతిని మిగుల్చుకోవటమే నాకు ముక్తి. అని యింకా ఏవేవో మధుర భావనలతో, తియ్యని ఆలోచనలతో, కమ్మని కలలతో కాలక్షేపం చేయటం పరిపాటైపోయింది.

సాయంకాలం వేళలో పక్షులు గూళ్లకు చేరుకుంటున్నాయి. వాటితో పోటీపడుతూ ఆరుబైట పిల్లల కేరింతాలు. ఇరుప్రక్కల రెండు వాటాలలోనూ అద్దెకుంటున్నారు. ఎడమవైపు వాటాలో పల్లెటూరునుండి పురుడుకు హాస్పిటల్‌కు వచ్చినవాళ్లు. వాళ్లతో నేను కలివిడిగా వుండేదానను కాదు. వుండాలని అనిపించేది

# మమతల తిగలు

కాదు. అసలు ప్రక్కవాటాలో మనుష్యులున్నారనే భావనే కలిగేది కాదు.

నీరు పల్లాన ప్రవహించటం ఎంత సహజమో మమత వున్నచోట మనసు చోటు చేసికోవటం అంత సహజమేమో.

దూరంగా అన్నయ్య సైకిలు వేసికొని రావటం చూశాను. ఆలోచనలమాల పుటుక్కున తెగింది. అన్నయ్యవైపు వోసారి చూసి లోపలకు వచ్చేశాను

'రాజీ! మనకు ట్రాన్స్‌ఫర్ అయింది' అన్నయ్య గొంతు.

'ఏవూరండీ!' వదిన ప్రశ్న.

'నర్సాపురం!' ధీమాగా ధ్వనించిందా కంఠం.

నాలో ఒక్కసారిగా ఎర్రగా కాలే నిప్పులపై నీళ్లుపోసిన చిటప ఘోష లాంటి ఘోష బయలుదేరింది.

నాకున్న బాధ, ఘోష, తపన అన్నయ్యకు లేవా?

ఎవరో అద్దెకుంటున్నవాళ్లు వెళ్లిపోతుంటే నాకెందుకు బాధ? నా కడుపులో మంటెందుకు? నా హృదయం బద్దలు కావటం ఎందుకు?

వాళ్లకు బాధగా లేదే!

పిచ్చిదానా! వాళ్లకెందుకుంటుంది బాధ! వాళ్లు వుద్యోగరీత్యా వచ్చిన మనుష్యులు! మరో వూరు వెళ్లవలసివచ్చింది వెళ్లిపోతున్నారు!

నీ యింట్లో మమత లోపించటంవలన—వెర్రిగా వాళ్లు నీపై పెంచుకోకపోయినా—పిచ్చిగా వాళ్లపై పెంచుకున్నావు. బాధపడుతున్నావు. వేదన చెందుతున్నావు.

వాళ్లు నీపై మమకారం పెంచుకునే అవసరం ఏముంది? ఆయనకు ప్రేమానురాగాలు కురిపించే తల్లిదండ్రులు, ఆప్యాయంగా ఆదరించే అక్కచెల్లెళ్లు, తమ్ముళ్లు. అంతకన్నా ప్రేమను గుమ్మరించే భార్య, ముద్దుమాటలతో అలరించే కూతురు.

ఏ లోపంవలన నీపై మమత పెంచుకోవాలి?

కాకపోతే వాళ్ల అవసరార్థం నీకు అద్దె యిచ్చి నీ యింట్లో వున్నారు. అంతే!

కొన్నాళ్లు పరిచయస్థులే కాని మీ యిద్దరిమధ్యా ఏ బంధమూ లేదు. ఇలా ఎన్నో చెప్పింది అంతరాత్మ.

అంతేనంటావా? ఏవిధమైన మమతానుబంధం లేదంటావా?

వెర్రిదానా! 'మమత' అనే మాటకు ఈ రోజులలో 'అవసరం' అని చెప్పుకోవాలి. అర్థంలేని ఆత్మీయతకు, సౌహార్ద్రతకు పోవటం చాలా అవివేకం సుమా! హెచ్చరించింది.

వెచ్చటికన్నీరు చెంపలపైదుగా జాలువారాయి.

రెండురోజులలో అన్నయ్యవాళ్లు వెళ్లిపోతారనగా అన్నయ్యను, వదినను భోజనానికి పిల్చాను.


పదార్థాలు వడ్డిస్తూవుంటే నా చేయి వణికింది. గరిట కదలాడుతూవుంటే అన్నయ్య నా కళ్లలోకి చూశారు.

ఆ చూపులలో ఎన్నేళ్లనాటిబంధమో దాగివున్నట్లనిపించింది.

ఆ కళ్లల్లో మమత ఆర్ద్రత కన్పించాయి

ఆయన నా గురించి బాధ పడుతున్నారా?

మరునాటిరోజు సర్కారుకు అన్నయ్యవాళ్లు వెళ్లిపోతున్నారనే వూహ నిర్మలమైన నీటిమీద బొక్కెనవేసి ధబీలున కొట్టినట్లనిపించింది.



భయంకరమైన అగ్నిజ్వాలలు నాలో బయలుదేరాయి. మనసంతా అస్తవ్యస్తంగానే వుండిపోయింది.

యాంత్రికంగానే నాన్నకు తమ్ముళ్ళకు భోజనాలు పెట్టాను.

లోకమంతా అంధకారంగా శూన్యంగా నిర్వికారంగా కన్పించింది.

అమ్మ పోయినరోజుకూడ నేనంత బాధ అనుభవించలేదేమో;

వేకువఝామున అన్నయ్యావాళ్ళు వెళ్తావుంటే వీధి చివరదాకా నిండా పవిట కప్పుకొని శూన్యంలోకి చూస్తూ వెళ్ళాను. రిక్షా కదలబోతుండగా 'అమ్మా వెళ్ళొస్తాను. జాగ్రత్త!' అన్నారు.

ఎర్రనికడ్డీతో నా వీపుపై వాతపెట్టినట్లుంది. వాళ్ళ రిక్షా తారురోడ్డుమీద, సిమెంటురోడ్డుమీద పోవటంలేదు. నా హృదయం మీద దయాదాక్షిణ్యాలు లేకుండ సాగిపోతుంది.

'ఛీ ఎవరిపై మమత పెంచుకోకూడదు.' మొదటిసారిగా అనుకున్నాను.

ఎడతెరిపి లేకుండ కళ్ళనీళ్ళు కారిపోయాయి. ఆ రోజు చాలా నిశ్శబ్దంగా ఎవ్వరికీ తెలియకుండ చాలాసేపు యేడ్చేను.

వదిన వెళ్తూవెళ్తూ నా చేతిలో పెట్టిన పది రూపాయలనోటును నలిపివేసాను. వాళ్ళనుండి నేను ఆశించింది—

మనీనా? మమతనా?

ఇవి నా కర్థంకాని, నే నాలోచింప శక్తిలేని పేలవమైన ప్రశ్నలు!

ప్రక్కింట్లో వున్న అమ్మాయి ప్రసవించటం, పురుడు పోసుకోవటం వెళ్ళిపోవటం మరో వారంరోజులలో గడిచిపోయాయి.

రెండు వాటాలూ ఖాళీగా వున్నాయి. అన్నయ్య పోవటంతో నా మనసంతకు మునుపే ఖాళీ అయిపోయింది.

ప్రతిపనిని హృదయపూర్వకంగ చేయలేకపోతున్నాను. నాన్నను తమ్ముళ్ళను ఎక్కువగ పల్కరించటంలేదు. అడిగినదానికి 'ఊ...'ల లోనే సమాధాన మిస్తున్నాను.

ఒకటే తలనొప్పి. జ్వరం వచ్చినట్లుగా వుంది. వూరంతా ఫ్లూజ్వరాలు వున్నాయి. బహుశ ఆ జ్వరం నాకు వచ్చి చచ్చిపోతే ఎంత బాగుండును? అనుకున్నాను.

మరునటిరోజు జ్వరం రానే వచ్చింది.

నాన్నగారికి సదుపాయం లోపించిందని సాధిస్తూనే వున్నారు. తమ్ముళ్ళిద్దరూ వంట ప్రయత్నంలో మునిగి పోయారు. ఒక్క తమ్ముడైనా కాఫీ పెట్టి యిస్తాడనీ, ఆప్యాయంగా 'అక్కా వంట్లో ఎలా వుందని' అడుగుతాడని ఎంతగానో ఆశించాను. సాయంకాలం వరకూ అలాంటిదేమీ జరగలేదు.

బెజవాడలో చూచిన గాంధీగారి విగ్రహం కళ్ళముందు నిలిచింది.

ఈ ప్రజలకోసం, ఈ దేశంకోసం ఆయన బలైపోయారు. అటువంటిది నేనే పాటి దానను!

బాపూజీ అంటే నాకు ప్రాణం. ఆయనను నే నెన్నడూ చూడలేదు. ఆయన వుండగ నేను పుట్టలేదు. ఆయనతో మాట్లాడలేదు.

వయస్సుతోపాటుగ కొద్దిపాటి విజ్ఞానంతో ఆయన దేశానికి 'జ్యోతి'లాంటవాడని ఊహించాను.

మమతా పూరితమైన ఆర్ద్రత మనసులో తొణికిసలాడగ కన్నీటిబిందువులు దిండుపై ముత్యాల్లా రాలాయి.

ఈ సమయంలో నాకేదో కావాలి! ఎవరైనా ఆర్ద్రతతో పల్కరించాలి! ఎవరైనా ప్రేమతో నా తల నిమరాలి! ఎవరైన అనురాగంగా నా మేనును

## ఇది మీకు తెలుసా?

* దరిదాపు మందులా వాడొచ్చు దీన్ని.

* గర్భిణి స్త్రీలు మూడు ఔన్సులు, పసిబిడ్డ తల్లులు అయిదు ఔన్సులూ వాడవచ్చునట.

* డయిబెటిక్ వ్యాధిగ్రస్తులు, రాస్నతగ్గాలని పిండిపదార్థాలు తగ్గించినవాళ్ళు రోజుకి తప్పదు అరు చెంచాలు వాడవచ్చు.

* ఆహారంలో అన్నిరకాల పప్పులు వాడాలి.

* సాధ్యమైనంత వరకు ముడిధాన్యంగా వాడాలి.

—కె. రా.

నిమరాలి! సానుభూతి సూచకంగా ప్రేమగా జాలిగా నన్నెవరైనా చూడాలి! మనసు క్రమేపి శాంతిని కోల్పోయింది. అంతులేని అలజడి అంతరంగంలో ప్రారంభమై పోయింది.

తమ్ముళ్ళిద్దరూ ఏదో తిట్టుకొంటున్నారు వంట చేసుకోలేక. పెనుగాలిలోని చెట్టులా మనసు వూగులాడడం ప్రారంభమైంది. ఒక్క మురళన్నయ్య మీదే నేను మమత పెంచుకోలేదు. యింకా మా యింట్లో వుండిపోయే ప్రతివ్యక్తిమీద మమత పెంచుకున్నాను.

ఆర్ద్రతతో కూడుకున్న ఈ నిండు మనస్సుకు మమతలతీగలు అల్లుకుంటే ఎంతో అందంగా మధురంగా వుంటుంది! కాని నాకది లభ్యం కాలేదు.

నాలుగేళ్ళ క్రిందట మాయింట్లో అద్దెనుండిపోయిన నీరజ గుర్తుకువచ్చింది. నీరజంటే నాకు ప్రాణం. చేసే వుద్యోగం వదిలివేసి పెళ్ళి నిశ్చయం కావటంతోనే వుద్యోగం, వూరు వదిలేసి పెళ్ళిచేసికొని పిల్లలతో హాయిగా సుఖిస్తోంది! ఆనాటి నీరజను నేను ఈనాటికి మర్చిపోను. అప్పుడప్పుడూ వుత్తరాలు వ్రాస్తూ వుంటాను.

'తీగ అల్లుకున్న బొంగుకర్ర ఏదో వుధృతమైన గాలికి పడిపోగా తీగ అల్లుకోకుండా వూరుకొంటుందా! 'మమత సమత' అంటూ ఏమిటీ కథలలోని మాటలు! అన్నయ్యలు, తమ్ముళ్ళు స్నేహితులపై మమత పెంచుకోవటం కాకుండ శాశ్వతమైన మమత కోసం అంటే నీ భాగస్వామి కోసరం, ఆ మమత కోసరం ఆరాటం చెందటం నేర్చుకో! అదే నిజమైన మమత. అదే నిజమైన ఆర్ద్రత! అందులో నీకు అనంతమైన తృప్తి వుంది. ఆనందం వుంది. అందం వుంది అంటూ పోనాడు వుత్తరం వ్రాసింది.

ఆమాటలు తలపుకు రావటంతో నా ఆలోచన మరో క్రొత్తమలుపు తిరిగింది.

ఒదే నీరజ చెప్పినమలుపు. ఒంట్లో వేడి ఎక్కడికో పారిపోయినట్లనిపించింది. ఇరవయ్యేళ్ళ ఈ జీవితకాలంలో ఎప్పుడూ పొందని క్రొత్త అనుభూతి పొందగా కంఠంవరకూ దుప్పటి కప్పుకుని తృప్తిగా కళ్ళు మూసుకున్నాను. ●